www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

ఆదివారం 9, ఆగస్టు, 2026 8 పేజీలు

## సమగ్ర సాగునీటి ప్రణాళికను ప్రకటించాలి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



2లో



# ఇందిరమ్మ ఇసుక పక్కదారి

- అనుమతుల పేరిట ప్రైవేట్ వ్యక్తులకు విక్రయం
- సర్కారు ఆదాయానికి గండి
- జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- చోద్యం చేస్తున్న రెవెన్యూ ,పోలీస్ అధికారులు

చంద్రుగొండ ,ఆగస్టు 8 (భద్రాద్రి న్యూస్):- ఇందిరమ్మ లబ్ధిదారుల పేరున తీసుకొస్తున్న ఇసుకను ట్రాక్టర్ యజమానులు పక్కదారి పట్టిస్తున్నారు. గ్రామాల్లో ఇతర వ్యక్తులు ప్రైవేట్ నిర్మాణాలకు 4000 కు ట్రిప్పు చొప్పున విక్రయిస్తూ జేబులో నింపుకుంటున్నారు. దీని పర్యవేక్షణ చేయాల్సిన ఒకరిద్దరు కిందిస్థాయి సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలిపారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని ప్రధానంగా గానుగపాడు రేపలవాడ తుంగారం సత్యనారాయణపురం అన్నారుగూడెం గ్రామస్తులు అక్రమంగా పోకల గూడెం గ్రామాల్లో ఇసుక దందా జోరుగా కొనసాగుతుంది.



2 లో..



# ఆర్టీఐ వేస్తేనే స్పందిస్తారా?



2 లో..

### ప్రజల ఫిర్యాదులకు స్పందించరా.. మద్యం సరఫరా ఆటోలపై చర్యలేవీ? అధికారుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి

కారేపల్లి ఆగస్టు 8(భద్రాద్రి న్యూస్ : కారేపల్లి మండలంలో మద్యం విక్రయాలు, సరఫరాపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గ్రామాల్లో ఆటోల ద్వారా మద్యం సరఫరా జరుగుతోందనే ఆరోపణలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారో స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

## వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక అమలు చేయాలి

వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగించే ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెంచాలి

తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత.. కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు

నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలి

చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

6లో

# ఇందిరమ్మ ఇసుక పక్కదారి

మొదటి పేజీ తరువాయి

ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు పగలు రాత్రి అని తేడా లేకుండా ఇష్టం వచ్చినట్లు ఇసుకను వ్యాపారులు తోలుతూ జేబులు నింపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మేలుకొని సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**– రెచ్చిపోతున్న అక్రమార్కులు**

మండలంలోని వాగులు వంకలు మీద పడుతున్న అక్రమార్కులు రాత్రింబవళ్లు ఇసుక తోడి రవాణా చేస్తున్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారుల పేరు చెప్పి యధాచగా బయట అమ్మేస్తున్నారు మండలంలో ఈ ఇసుక రవాణా జోరుగా కొనసాగుతుంది. అయితే ప్రైవేట్ ప్రభుత్వ నిర్మాణాలకు ఒక్కో ట్రాక్టర్ 600 చొప్పున బ్యాంకులో డిడి తీసి తాసిల్దార్ కార్యాలయంలో ఇస్తే అనుమతులు ఇస్తారు ఇందిరమ్మ ఇళ్లకు మాత్రం ప్రభుత్వం నుంచి ఫ్రీగా పర్మిషన్ ఇస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకుంటున్న అక్రమార్కులు వాగులు వంకలో యధాచక ఇసుక తోడేస్తున్నారు. గానుగపాడు, తుంగారం, రేపల్లెవాడ గ్రామాలకు చెందిన ఇసుక వ్యాపారులకు ఇందిరమ్మ ఇల్లు వరంగ మారాయి .లబ్ధిదారుల ప్రొసీటింగ్ కాపీలను తీసుకువచ్చి అనుమతులు తీసుకుంటున్నారు. వాస్తవానికి లబ్ధిదారులకు ఎంత ఇసుక అవసరమకో హౌసింగ్ ఏఈ ద్వారా లెటర్ తీసుకొని తహసిల్దార్ కు ఇవ్వాలి, ఆ తర్వాతే ఇసుక పర్మిట్ పంపిణీ చేయాలి కానీ ఇక్కడ అవేమీ జరగటం లేదని జోరుగా అవరోపణలు వినిపిస్తున్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్టీఐ వేస్తేనే స్పందిస్తారా?

మొదటి పేజీ తరువాయి

మద్యం సరఫరా కోసం ఆటోలను ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు నిఘా పెట్టారా? తనిఖీలు నిర్వహించారా? నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న ఒక్క ఆటోనైనా పట్టుకున్నారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో మద్యం విక్రయాలు, సరఫరాపై ఆరోపణలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక అధికారులను ప్రశ్నించినా సరైన స్పందన లేకపోవడంతో చివరకు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు అంటున్నారు. ప్రజలు అడిగిన సమాచారాన్ని అధికారులు సాధారణంగానే వెల్లడించాల్సి ఉండగా, ఆర్టీఐ దరఖాస్తు వేస్తేనే స్పందించే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నిస్తున్నారు.మండలంలో ఇప్పటివరకు మద్యం అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలు, అనధికారిక సరఫరాపై ఎన్ని తనిఖీలు జరిగాయి? ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎన్ని వాహనాలపై చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు అధికారుల వద్ద ఉన్నాయా లేదా అన్నది తెలియాల్సి ఉంది.

ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు సమస్యలపై స్పందించకపోవడం, సమాచారం కోసం ఆర్టీఐను ఆశ్రయించాల్సి రావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం సరఫరా చేస్తున్న ఒక్క ఆటోనైనా పట్టుకున్నారా? పట్టుకుంటే ఏ చర్యలు తీసుకున్నారు? అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు.

మద్యం సరఫరాపై వస్తున్న ఆరోపణలపై అధికారులు ఇప్పటికైనా స్పందించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అధికారులు ఆర్టీఐ వేసే వరకు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

## వైరాలో వాణి వివేకానంద విద్యాలయంలో ఘనంగా బోనాల జాతర

**. అట్టహాసంగా జరిగిన బోనాల పండుగ జాతర**

**.ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వాణి**





**వైరా, ఆగస్టు 8, (భద్రాద్రి న్యూస్)**

వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ వాని వివేకానంద విద్యాలయంలో ఆషాడ మాస బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు బోనాలు తయారు చేసి అమ్మవారి విగ్రహాలను అలంకరించి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో బోనాల వేడుకలను ప్రారంభించారు. ఈ ఆషాడ మాసం బోనాలు వేడుకలకు ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ వాణి హాజరై అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పండుగలలో ప్రత్యేకమైన పండుగ బోనాల పండుగ అని, మన పూర్వీకుల సాంప్రదాయం, సంస్కృతి లకు ప్రతీకలుగా జరుపుకోవడం చాలా ప్రత్యేకతతో కూడుకున్నదని ఇలాంటి పండుగ వేడుకలను మన పాఠశాలలో నిర్వహించటం వలన చిల్లవయసువంటి మన సంస్కృతి, సాంప్రదాయాలను నేర్చుకుంటూ, గౌరవించుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు తెలియజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతో రంజింప చేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సమగ్ర సాగునీటి ప్రణాళికను ప్రకటించాలి

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 8 (భద్రాద్రిన్యూస్ ):-**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగునీటి లభ్యత, వినియోగం, నీటి విడుదలపై రైతులకు ప్రభుత్వం స్పష్టమైన అవగాహన కల్పించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వడంతో పాటు, రైతులు ముందస్తుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని మాజీ మంత్రి పువ్వాడ పేర్కొన్నారు.

వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్, గోదావరి, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని తదితర జల వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, ఆయకట్టు రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని కోరారు.

ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేరకు నీటి నిల్వలు ఉన్నాయి, ఎప్పుడు నీటిని విడుదల చేస్తారు, ఏ ప్రాంతాలకు ఎంత మేరకు నీరు అందుబాటులో ఉంటుంది అనే వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించి అధికారికంగా ప్రకటించాలని అన్నారు. నీటి విడుదలకు సంబంధించి ముందస్తు షెడ్యూల్‌ను ప్రకటిస్తే రైతులు పంటల ఎంపిక, సాగు సమయం, నీటి వినియోగంపై సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణ, నీటి లభ్యతపై ఎలాంటి అనిశ్చితి లేకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడితే రైతులు నష్టపోకుండా పంటల సాగును ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## 19వ డివిజన్లో క్లీన్ అండ్ గ్రీన్



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 8( భద్రాద్రి న్యూస్):**

ఖమ్మం 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ దగ్గర ఉండి డివిజన్ లోని ఇంటింటి చెత్తను ట్రాక్టర్ కి ఎత్తించడం , డివిజన్ లోని సైడ్ డ్రైనేజీ లో పేరుకుపోయిన చెత్తను, డ్రైనేజీ పక్కన గడ్డి మొక్కలను శుభ్రం చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డివిజన్ జవాన్ నాగరాజు, పాషా, నర్సిరెడ్డి, భాస్కర్, బాల, శివరాం, శ్యామల, రాజు, వరికోటి భాస్కర్, మల వెంకట్, విజయలక్ష్మి, కన్నెబోయిన ముత్తయ్య, కొలిక పొంగు రమేష్, యాదవ్ నరేష్, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శతాధిక వృద్ధురాలు అంజి మృతికి నామ సంతాపం

**ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీ**



కారేపల్లి, ఆగస్టు 8 (భద్రాద్రి న్యూస్ ): కారేపల్లి మండలం చిన్నకట్టుగూడెం గ్రామానికి చెందిన మాజీ దిశా కమిటీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్ నాయనమ్మ, శతాధిక వృద్ధురాలు లకావత్ అంజి (101) శనివారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఫోన్‌లో లకావత్ లక్ష్మణ్‌ను పరామర్శించారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అంజి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని నామ నాగేశ్వరరావు తెలిపారు.

# వైరాలో వాహనాలను తనిఖీ చేసిన పోలీస్ అధికారులు

.ఎలాంటి ఆధారాలు లేని 50 వాహనాలను సీజ్ చేసిన పోలీస్ అధికారులు



**వైరా, ఆగస్టు 8,( భద్రాద్రి న్యూస్)**

వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ రింగ్ రోడ్ సెంటర్లో శనివారం వైరా ఏసిపి సారంగపాణి, సిఐ వెంకటప్రసాద్, ఎస్సై పుష్పాల రామారావు, లు వాహనాలను తనిఖీ నిర్వహించి హెల్మెట్లు, లైసెన్సులు, వాహనాలకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకుండా తిరుగుతున్న 50 బైకులను స్వాధీనం చేసుకొని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వైరా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాల పట్ల, జాగ్రత్తలు వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, సెల్ఫోన్ చెవి కాడ పెట్టి డ్రైవింగ్ చేయటం చాలా ప్రమాదకరమని, మూలమలుపు దగ్గర చిన్నగా వెళ్లాలని, మందు త్రాగి వాహనాలను నడపటం చాలా ప్రమాదకరమని, నేరమని, హెల్మెట్లు, లైసెన్స్ లో, లేకుండా ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామని, వాహనదారులు తప్పకుండా సిగ్నల్స్ పాటించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటప్రసాద్, ఎస్సై పుష్పాల రామారావు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# వీరయ్య మృతికి సీపీఎం నాయకుల నివాళి





**సింగరేణి, ఆగస్టు 8 (భద్రాద్రి న్యూస్ ):**

సింగరేణి మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఏరిపోతు వీరయ్య (80) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు ఆయన భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు కేసగాని రామ్మూర్తి, ఏరిపోతు భద్రయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో వీరయ్య చురుకుగా పాల్గొనేవారని తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా ఉద్యమాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వీరయ్య మృతి కుటుంబంతో పాటు పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. మృతుడి భార్య ముత్తమ్మ, కుమారులు శ్రీనివాస్, సురేష్, రాధాకృష్ణ, కుమార్తె సావిత్రికి నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్, శాఖ కార్యదర్శి ఈసం వెంకటేశ్వర్లు, ఈసాల పగడయ్య, అబ్రహం, టీఆర్ఎస్ నాయకులు బత్తుల శ్రీనివాసరావు, బంధుమిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంస్కృతి వారధి సర్వజ్ఞ

**రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 8 (భద్రాద్రిన్యూస్ ):-**

ఖమ్మం పట్టణం విడిఒస్ కాలనీ నందు గల ప్రముఖ విద్యాసంస్థ సర్వజ్ఞ పాఠశాల యందు తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే మహోత్తర పండుగ బోనాలను పురస్కరించుకొని బోనాల పండుగ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ప్రజలందరికీ తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బోనాలు అనేది తెలంగాణ ప్రజల ఆరాధ్య దేవత గ్రామ దేవతలకు జరిపే పూజ. ఆషాఢ మాసంలో గ్రామ దేవతలను శాంతింపజేయడానికి, పంటలు బాగా పండాలని, పశు సంపద వృద్ధి చెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఈ పండుగను జరుపుకుంటారు.

పాఠశాల డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదు, ఇదొక సామూహిక వేడుక. ఊరంతా కలిసి అమ్మవారిని కొలిచి, పల్లకి సేవలు, పోతరాజుల విన్యాసాలు, ఆడపడుచు నృత్యాలు,డప్పుల శబ్దాలతో సందడిగా జరుపుకుంటారు. ఇది ప్రజలలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తుంది, మన తెలంగాణ సంస్కృతి, జీవన విధానం. అమ్మవారి ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని కోరుకుంటున్నాము. ఈ పండుగ మన సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు.

అదేవిధంగా, పాఠశాల కరస్పాండెంట్ కె. నీలిమ మాట్లాడుతూ, "బోనాల పండుగ భక్తి శ్రద్ధలకు, సామూహిక సంతోషానికి ప్రతీక. వర్షాలు కురవడం ప్రారంభమయ్యే ఆషాఢ మాసం ప్రారంభంలో ఈ పండుగ వస్తుంది. భక్తులు తమ కోరికలు తీరినందుకు లేదా తీరాలని కోరుతూ 'బోనం' (అంటే భోజనం) సిద్ధం చేసి, పసుపు, కుంకుమ, వేప కొమ్మలతో అలంకరించిన కుండలలో నైవేద్యంగా అమ్మవారికి సమర్పిస్తారు.ఇది ప్రకృతితో మానవుడి సంబంధాన్ని, వ్యవసాయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది.ఈ శుభదినం అందరి






జీవితాల్లో ఐశ్వర్యాన్ని, విజయాలను తీసుకురావాలని ప్రార్థిస్తున్నాము. సర్వజ్ఞ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు, మరియు రాష్ట్ర ప్రజలందరికీ ఈ మహోన్నత పండుగ శుభాకాంక్షలు" అని తెలిపారు.

సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పదనాన్ని తెలియజేయడానికి కట్టుబడి ఉందని, ఇటువంటి పండుగలు మన మూలాలను గుర్తుచేస్తాయని పాఠశాల యాజమాన్యం అభిప్రాయపడింది. బోనాల పండుగను అందరూ సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని సర్వజ్ఞ పాఠశాల కోరింది.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని చాటిన త్రివేణి విద్యార్థులు

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 8 (భద్రాద్రిన్యూస్):-**

క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకుంటూ త్రివేణి టాలెంట్ స్కూల్, ఖమ్మం శాఖలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీజీ ఇచ్చిన "భారత్ విడిచి వెళ్లండి" పిలుపు స్వాతంత్య్ర పోరాటంలో ప్రజల ఐక్యత, త్యాగానికి ప్రతీకగా నిలిచిందని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు జాతీయ పతాకాలతో దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, నినాదాలతో స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకున్నారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశభక్తి, ఐక్యత, బాధ్యతాయుత పౌరసత్వం వంటి



విలువలను అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. డైరెక్టర్ డా. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను భావితరాలకు పరిచయం చేయడం విద్యాసంస్థల బాధ్యత అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని విద్యార్థులు క్రమశిక్షణ, ఐక్యత, దేశసేవ ద్వారా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే ఒప్పందాలను రద్దు చేయాలి

**ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి - పీవైఎల్ రాష్ట్ర నాయకుడు భూక్య శివ నాయక్**




కారేపల్లి, ఆగస్టు 8(భద్రాద్రి న్యూస్ ): వ్యవసాయ రంగాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, రైతు--కార్మిక ప్రజలకు వ్యతిరేకంగా చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర నాయకుడు భూక్య శివ నాయక్ డిమాండ్ చేశారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పీవైఎల్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు.

1942లో బ్రిటిష్ పాలకులను దేశం విడిచి వెళ్లాలని డిమాండ్ చేస్తూ క్విట్ ఇండియా ఉద్యమం సాగిందని, అదే స్ఫూర్తితో నేడు దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం నుంచి కాపాడేందుకు ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దెబ్బతీసే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను పెంచేందుకు ప్రధాన ఉత్పత్తి రంగాలైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో నిరంతరం శ్రమిస్తున్న రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల జీవించే హక్కులను కాపాడాలని అన్నారు. రైతులకు పంటల మద్దతు ధరకు చట్టబద్ధమైన గ్యారెంటీ కల్పించాలని, రుణమాఫీ చట్టం చేసి అమలు చేయాలని, పంటల బీమాను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సవరణ చట్టం--2025ను రద్దు చేయాలని, విత్తన బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులకు నష్టం కలిగించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన కోరారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మంగన్న, మీసం శ్రీను, పీవోడబ్ల్యు రాష్ట్ర నాయకులు భాగ్యక్క, రాధా తదితరులు పాల్గొన్నారు.

# మల్లు భట్టి విక్రమార్క ఆశీస్సులతో.. కిషోర్ కుమార్‌కు కీలక పదవి?

**రెండు కీలక పదవుల్లో పైడిపల్లి కిషోర్ కుమార్ పేరు!**

**డీసీసీబీతో పాటు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ రేసులో కిషోర్**

**ఖమ్మం డీసీసీబీ చైర్మన్ రేసులో కిషోర్ కుమార్ ముందంజలో?**

**రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవికి కూడా కిషోర్ పేరు పరిశీలనలో!**

**డీసీసీబీనా.. కార్పొరేషన్ చైర్మన్ పదవినా? ఆసక్తికరంగా మారిన చర్చ**

**(మధిర ఆర్సీ భద్రాద్రి న్యూస్ ప్రతినిధి :**

ఖమ్మం: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్‌కు త్వరలోనే కీలక పదవి దక్కే అవకాశం ఉందన్న ప్రచారం ఖమ్మం జిల్లా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్ పదవితో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఓ కార్పొరేషన్ చైర్మన్ పదవికి కూడా కిషోర్ కుమార్ పేరు పరిశీలనలో ముందంజలో ఉన్నట్లు సమాచారం.

పార్టీ అధిష్ఠానం నామినేటెడ్ పదవుల భర్తీపై కసరత్తు చేస్తున్న నేపథ్యంలో కిషోర్ కుమార్ పేరు రెండు కీలక పదవుల విషయంలో వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయిలో డీసీసీబీ చైర్మన్ పదవితో పాటు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవికి కూడా ఆయన పేరును పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కిషోర్ కుమార్‌కు ఉన్న రాజకీయ అనుబంధం నేపథ్యంలో ఆయనకు కీలక బాధ్యత అప్పగించే అవకాశం ఉందనే ప్రచారం మరింత ఊపందుకుంది. దీంతో కిషోర్ కుమార్‌కు ఏ పదవి దక్కనుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

డీసీసీబీ చైర్మన్ పదవా.. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవా? అన్న చర్చ ప్రస్తుతం ఖమ్మం జిల్లా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రెండు పదవుల్లో ఏదో ఒక కీలక బాధ్యత కిషోర్ కుమార్‌కు దక్కే అవకాశం ఉందన్న ప్రచారం ఆయన అనుచరులు, పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠను పెంచుతోంది. అయితే ఈ అంశంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకున్న తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. దీంతో కిషోర్ కుమార్‌కు కీలక పదవి దక్కుతుందా? దక్కితే ఏ పదవి లభించనుంది? అన్నది ఆసక్తిగా మారింది.

## బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకురాలు మనీషా లక్ష్మి అండ

**మృతుల కుటుంబాలకు పరామర్శ.. పక్షవాత బాధితుడికి ధైర్యం**

**సింగరేణి, ఆగస్టు 8:( భద్రాద్రి న్యూస్ ):-**

సింగరేణి మండలంలో బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు మనీషా లక్ష్మి మదన్‌లాల్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను పరామర్శించి, బాధితులకు ధైర్యం చెప్పారు. మాజీ దిశా కమిటీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్, ప్రజాపక్షం విలేకరి లకావత్ రాము నాయనమ్మ లకావత్ అంజి (101) మృతి చెందడంతో ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా కుంపెలగూడెం గ్రామానికి చెందిన తాటి నారాయణ (60) మృతి చెందడంతో ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన పొదిరి శ్రీనుకు పక్షవాతం వచ్చిన విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు వాంకూరత్ జగన్‌నాయక్, మండల నాయకులు డొంకెన రవీందర్, తాత వెంకన్న, రవీందర్‌రెడ్డి, కొత్తతండా



సర్పంచ్ ధారావత్ మంగీలాల్, సూర్యతండా మాజీ సర్పంచ్ జరుపుల హచ్చు, కిలారి వెంకటేశ్వర్లు, మండల యువ నాయకులు సోమందుల నాగరాజు, జడల కళ్యాణ్, మూతి కోటేశ్వరరావు, గుగులోత్ జుంకీలాల్, ధారావత్ వికాస్, భూక్య మధు, పొక్కిలి యుగంధర్, గంగారబోయిన మురళి, రాజేష్ నాయక్, పలిక వీరస్వామి, కోటి, పొడుగు హరీష్, చింతల సంపత్, దానబోయిన సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

# మానవత్వమే మార్గంగా... మృతుల కుటుంబాలకు డాక్టర్ బాదావత్ రవి సానుభూతి

**లకావత్ అంజి, తాటి దుర్గయ్య మృతిపై సంతాపం వ్యక్తం**



**కారేపల్లి. ఆగస్టు 8(భద్రాద్రి న్యూస్ ):**

సింగరేణి మండలం గుంపెల్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నకట్టగూడెం గ్రామానికి చెందిన ప్రజాపక్షం విలేకరి, మాజీ టీఆర్ఎస్ పార్టీ దిశా కమిటీ సభ్యులు లకావత్ రాము, లకావత్ లక్ష్మణ్‌ల నానమ్మ లకావత్ అంజి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతిపట్ల మిషన్ వాక్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ బాదావత్ రవి సంతాపం వ్యక్తం చేశారు. లకావత్ అంజి మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్న డాక్టర్ బాదావత్ రవి, మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అదేవిధంగా గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన తాటి దుర్గయ్య మృతి పట్ల కూడా డాక్టర్ బాదావత్ రవి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం కుటుంబ సభ్యులు, బంధువులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఎవరికి ఆపద వచ్చినా మానవతా దృక్పథంతో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్ బాదావత్ రవి అన్నారు. మృతుల కుటుంబాలకు తన వంతు అండగా ఉంటానని, వారి బాధలో భాగస్వామినవుతానని తెలిపారు. ఈ సందర్భంగా గుంపెల్లగూడెం, చిన్నకట్టగూడెం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, యువకులు, గ్రామస్తులు, బంధువులు మృతుల కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు.

## కొత్తగూడెం ఏరియా జీఎం కార్యలయం లో సిపిఆర్ అవగాహన

**కొత్తగూడెం సింగరేని , ఆగస్టు 8( భద్రాద్రిన్యూస్ ):-**

కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జనరల్ మేనేజర్ సి హెచ్. వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జీఎం జనరల్ మేనేజర్ సి హెచ్. వెంకటరమణ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహన, శిక్షణ కలిగి ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించే విధంగా ఉద్యోగులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ప్రాథమిక సహాయం అందించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీఎం గారు సూచించారు. ఈ కార్యక్రమం లో భాగంగా గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ కు గురైన వ్యక్తిని గుర్తించడం, స్పందన మరియు శ్వాసను పరిశీలించడం, అత్యవసర వైద్య సహాయం కోసం సమాచారం అందించడం, ఛాతీపై కంప్రెషన్స్ చేయడం, అవసరమైన





సందర్భాల్లో ాజుణ పరికరాన్ని వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యోగులతో ప్రాక్టికల్‌గా సీపీఆర్ చేయించి, సరైన విధానాన్ని ఎంఆర్ఎస్ వారు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో తొలి కొన్ని నిమిషాలు ఎంతో కీలకమని, వైద్య సిబ్బంది చేరుకునేలోపు సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని శిక్షకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం గారితో పాటు ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు , ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి, ఇంచార్జ్ వీ=ూ అనంతరామయ్య , ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, డివైపిఎం హరీష్ , సీనియర్ పీఓ మురళి , ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఐఎన్టియూసి ఫిట్ సెక్రటరీ సిహెచ్. సాగర్, ఏఐటి యూసి ఫిట్ సెక్రటరీ కే.సౌజన్య, ఇతర విభాగ ఆధికారులు, ఉద్యోగులు, మరియు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

**ఆగస్టు 8(భద్రాద్రి న్యూస్ ):**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ లో ఔట్‌సోర్సింగ్,కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి ప్రస్తుతం ఎలాంటి నోటిఫికేషన్ విడుదల కాలేదని ఎంజిఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పష్టం చేశారు.ఉద్యోగాల పేరుతో మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ విడుదలైన అనంతరం మాత్రమే రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.అందుకు సంబంధించిన ప్రజా ప్రకటనను శనివారం రోజున ఎంజిఎం సూపరింటెండెంట్ విడుదల చేశారు.



OFFICE OF THE SUPERINTENDENT, MGM HOSPITAL, WARANGAL

PUBLIC NOTICE

[illegible]

SUPERINTENDENT,
MGM HOSPITAL, WARANGAL

# చిన్నారులకు సకాలంలో టీకాలు తప్పనిసరి

**టీకాల అనంతరం ఆరోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి: గాదేపాడు సర్పంచ్ రంజిత్‌కుమార్**



**గాదేపాడు, ఆగస్టు 8 (భద్రాద్రి న్యూస్ ):**

గాదేపాడు గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సంవత్సరంలోపు వయస్సు ఉన్న చిన్నారులకు శనివారం టీకాలు వేశారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాదేపాడు సర్పంచ్ భూక్య రంజిత్‌కుమార్, ఏఎన్ఎం వాంకుడోత్ కల్పన, అంగన్‌వాడీ టీచర్ రాణి, ఆశా కార్యకర్త భూక్య రోజని, అంగన్‌వాడీ ఆయా మల్లమ్మతో పాటు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన సమయానుసారం తప్పనిసరిగా టీకాలు వేయించాలని తల్లులకు సూచించారు. పిల్లలకు ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా మినీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ సంధ్య, ఏఎన్ఎంను సంప్రదించి తగిన వైద్య సలహాలు తీసుకోవాలని తెలిపారు .

టీకాలు వేసిన అనంతరం పిల్లలకు జ్వరం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యులతో పరీక్షలు చేయించాలని సర్పంచ్ కోరారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు .

# పచ్చని భద్రాచలమే లక్ష్యం





**సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ**

**భద్రాచలం, ఆగస్టు 8 (భద్రాద్రిన్యూస్):**

భద్రాచలం పట్టణాన్ని పచ్చని వనంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రీన్ భద్రాద్రి--భద్రాచలం ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు అభినందనీయమని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అన్నారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు కృషి చేయడం ప్రశంసనీయమన్నారు.గ్రీన్ భద్రాద్రి--భద్రాచలం ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గౌరవ అతిథిగా భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణదొర హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం వంటి పవిత్ర పుణ్యక్షేత్రాన్ని మరింత పచ్చదనంతో, ఆహ్లాదకరమైన వాతావరణంతో తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని సర్పంచ్ పునేం కృష్ణదొర అన్నారు. గ్రీన్ భద్రాద్రి చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను అభినందిస్తూ ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి సెక్రటరీ రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు డా. గోళ్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, డా. శివరామకృష్ణ, వీరయ్య, సంపత్, ఆలయ పూజారి విశ్వనాథం, కార్‌స్టాండ్ అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు. వృక్ష ప్రేమికులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, దాతలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. "వృక్షో రక్షతి రక్షితః" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రకృతిని ప్రేమిద్దాం.. మొక్కలను నాటుదాం.. భవిష్యత్ తరాలను కాపాడుదాం అని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# కొత్త లింగాల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవ ఎన్నిక

**పగిడిపల్లి కాటయ్య అధ్యక్షులుగా ... ఎరుకల రమేష్ ఉపాధ్యక్షులుగా**



**కామేపల్లి,ఆగస్టు 8 (భద్రాద్రి న్యూస్):-**

కామేపల్లి మండల పరిధిలోని కొత్త లింగాల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు కార్యదర్శులు ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది వారితోపాటు కార్యవర్గాన్ని అనుబంధ సంఘాల నాయకులను నియమించారు. కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు ఆదేశానుసారం. కొత్త లింగాల గ్రామములో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖను పార్టీ కార్యకర్తల సమావేశపరిచి అట్టి సమావేశంలో ఏకగ్రీవంగా గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పగిడిపల్లి కాటయ్య ఉపాధ్యక్షులుగా ఎరకల రమేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల పెద్ద వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా యడ్లపల్లి శేషగిరిరావు కార్యదర్శిగా బైరెడ్డి యుగంధర్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండ్ల సుధాకర్ శాఖను ఏర్పాటు చేసుకోవడం జరిగినది కార్యవర్గ సభ్యులు తడిక మల్ల శ్రీను. గొడవర్తి శంకర్. చెరుకుమల్ల శ్రీను. అడపు శంకర్. నారాటి రోశయ్య. పండగ శ్రీను. అల్లం రాజేష్. రెంటాల వెంకన్న. ఎన్నుకోవడం జరిగినది నూతనంగా గ్రామ శాఖకు ఎన్నికైన సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు.జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్.డి సి సి బి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ జిల్లా నాయకులు తోటకూరి శివయ్య ఓబీసీ జిల్లా అధ్యక్షులు పిఏసిఎస్ కామేపల్లి అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం. కొండాయిగూడెం పి ఎస్ సి ఎస్ అధ్యక్షుడు దనియాక హనుమంతరావు. ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబురు నాయక్ మాజీ జెడ్పిటిసి సరిరామ్ నాయక్ తదితరులు పాల్గొని ఎన్నికైన వారిని అభినందించారు

# పేది కుటుంబానికి పెద్దదిక్కుగా కేసీఆర్ ...

**స్వర్గీయ పెద్ది దర్శన్ రెడ్డి కుటుంబానికి, పార్టీ తరఫున**

**రెండు కోట్ల 25 లక్షల రూపాయల అందజేత ...**

**(భద్రాద్రిన్యూస్):**



ఇటీవల అనారోగ్యంతో మరణించిన స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసిఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా, సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరోకోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో, పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో 25 లక్షలు రూపాయలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కెసిఆర్ గారు నిర్ణయించారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి భారత రాష్ట్ర సమితి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది. ఇంతటితోనే కాకుండా పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని అధినేత తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కాదా దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్యులు కూర్చొని వారి కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

# వికాస తరంగిణి బృందం ఆధ్వర్యంలో వెంకటాపురంలో శో భాయాత్ర









**భద్రాద్రి న్యూస్ వెంకటాపురం :**
వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వికాస్ తరంగిణి బృందంతో శనివారం సత్సంగం మరియు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ పలువురు భక్తులు పాల్గొన్నారు.ఆదివారం ఉదయం శ్రీరామ హృదయ కలశం శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్రం పుట్టినరోజు సందర్భంగా శ్రీరామ్ హృదయ కలశాలని ఆలయం నుండి శోభా యాత్ర ప్రారంభించి పెరిక వీధిలో వేంచేసి ఉన్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్దకు వికాస్ తరంగిణి బృందం ఆధ్వర్యంలో శోభయాత్ర గా తీసుకెళ్లనట్లు నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంఅమరవాది చిన్న కృష్ణమాచార్యులు గారి ఆధ్వర్యంలో వికాస్ తరంగిణి బృందం నేతృత్వంలో జరగనుంది

## వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 8( భద్రాద్రిన్యూస్ ):-**

వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.
ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించిన నీటిపారుదల సలహా సంసిద్ధత సమావేశంలో జిల్లాలోని నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, చెరువులు, మధ్యతరహా ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం పరిస్థితి, పంటల సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.
జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, రాబోయే రోజుల్లో నీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు భంగం కలగకుండా సాగునీటి వినియోగంలో శాఖల మధ్య సమన్వయం పాటించాలని స్పష్టం చేశారు.
జిల్లాలో మొత్తం 2,384 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉండగా, 598 చెరువులు 0--25 శాతం, 965 చెరువులు 25--50 శాతం, 587 చెరువులు 50--75 శాతం, 207 చెరువులు 75--100 శాతం నీటితో నిండాయి. మరో 27 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నట్లు అధికారులు తెలిపారు.
నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే కొత్తగూడెం నియోజకవర్గంలో మొత్తం 209 చెరువులకు గాను 13 చెరువులు 0--25 శాతం, 129 చెరువులు 25--50 శాతం, 72 చెరువులు 50--75 శాతం, 6 చెరువులు 75--100 శాతం నీటితో నిండగా, 2 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నాయి. లిఅశ్వారావుపేట నియోజకవర్గంలో 759 చెరువులకు గాను 271 చెరువులు 0--25 శాతం, 273 చెరువులు 25--50 శాతం, 76 చెరువులు 50--75 శాతం, 66 చెరువులు 75--100 శాతం నీటితో నిండగా, 23 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నాయి.
ఇల్లందు నియోజకవర్గంలో 241 చెరువులకు గాను 132 చెరువులు 0--25 శాతం, 96 చెరువులు 25--50 శాతం, 7 చెరువులు 50--75 శాతం, ఒక చెరువు 75--100 శాతం నీటితో నిండగా, 5 చెరువులు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నాయి. పినపాక నియోజకవర్గంలో 802 చెరువులకు గాను 94 చెరువులు 0--25 శాతం, 315 చెరువులు 25--50 శాతం, 313 చెరువులు 50--75 శాతం, 79 చెరువులు 75--100 శాతం నీటితో నిండగా, ఒక చెరువు పూర్తి స్థాయిలో నిండి మిగులు నీటితో ఉంది. భద్రాచలం నియోజకవర్గంలో 349 చెరువులకు గాను 26 చెరువులు 0--25 శాతం, 150 చెరువులు 25--50 శాతం, 124 చెరువులు 50--75 శాతం, 49 చెరువులు 75--100 శాతం నీటితో నిండాయి. మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిని పరిశీలిస్తే తాలిపేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 73.68 మీటర్ల నీటిమట్టంతో 669 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టు ఆయకట్టు 24,700 ఎకరాలు కాగా స్పిల్‌వే ద్వారా నీరు బయటకు వెళ్తోంది. పెద్దవాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 81.235 మీటర్లు కాగా, ప్రస్తుతం 75.235 మీటర్ల వద్ద 90.427 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంది. దీని ఆయకట్టు 2,360 ఎకరాలు. కిన్నెరసాని ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 124.08 మీటర్లు కాగా, ప్రస్తుతం 122.46 మీటర్ల నీటిమట్టంతో 6,950 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంది. దీని ఆయకట్టు 10,000 ఎకరాలు.
జిల్లాలో 455.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 561.4 మి.మీ.తో పోలిస్తే 18.8 శాతం లోటు నమోదైంది. జూన్‌లో 4.3 శాతం, జూలైలో 31.8 శాతం లోటు నమోదవగా, ఆగస్టులో ఇప్పటివరకు సాధారణం కంటే 1.2 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది.
వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలో పంటల సాగు ప్రణాళికను అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. సీజనల్ యాక్షన్ ప్లాన్‌లోని 4,86,048 ఎకరాల లక్ష్యానికి గాను 4,21,367 ఎకరాల్లో సాగు పూర్తై 86.69 శాతం సాధన నమోదైంది. ఇందులో పత్తి లక్ష్యం 2,19,000 ఎకరాలు కాగా 2,19,000 ఎకరాల్లో సాగై 100 శాతం సాధించింది. వరి లక్ష్యం 31,500 ఎకరాలు కాగా 70,652 ఎకరాల్లో సాగై 224.29 శాతం నమోదైంది. మొక్కజొన్న లక్ష్యం 1,08,500 ఎకరాలు కాగా 75,775 ఎకరాల్లో 69.84 శాతం, పెసర లక్ష్యం 12,500 ఎకరాలు కాగా 6,620 ఎకరాల్లో 52.96 శాతం, కంది లక్ష్యం 22,530 ఎకరాలు కాగా 2,916.23 ఎకరాల్లో 12.94 శాతం, మినుము లక్ష్యం 12,100 ఎకరాలు కాగా 324 ఎకరాల్లో 2.68 శాతం సాగైంది.జొన్న 2,000 ఎకరాల లక్ష్యానికి ఇప్పటివరకు సాగు నమోదు కాలేదు. ఆయిల్‌పామ్ లక్ష్యం 14,500 ఎకరాలు కాగా 3,516 ఎకరాల్లో 24.25 శాతం, సూర్యకాంతి లక్ష్యం 200 ఎకరాలు కాగా ఇప్పటివరకు సాగు లేదు. కూరగాయల లక్ష్యం 3,000 ఎకరాలు కాగా 680 ఎకరాల్లో 22.67 శాతం, ఇతర పంటల లక్ష్యం 60,218 ఎకరాలు కాగా 41,884 ఎకరాల్లో 69.55 శాతం సాగు నమోదైంది. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలో పంటల సాగు విధానంలో అవసరమైన మార్పులు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గిస్తూ, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పెసర, మినుము, కంది, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగం అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, పెసర, మినుము, కంది వంటి పంటలను ప్రాంతానుసారం సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లాలో 1,38,198 ఎకరాలను ప్రత్యామ్నాయ పంటల పరిధిలోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. అన్ని క్లస్టర్లలో పెసర, మినుము, కంది వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తూ సబ్సిడీ విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. సాగునీటి ఆధారిత మొక్కజొన్న, పత్తి, వరి ప్రాంతాల్లో పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఆయిల్‌పామ్ సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.
చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం, తాగునీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.